గిరిజన రైతులకు మారిషస్ పైనాపిల్ మొక్కలు

సీతంపేట: సీతంపేట, భామిని మండలాల్లో ప్రయోగాత్మకంగా గిరిజన రైతులకు మారిషస్ పైనాపిల్ మొక్కలను పంపిణీ చేయనున్నట్టు ఐటీడీఏ పీవో వి.వి.రమణ శనివారం ఒక ప్రటకటనలో తెలిపారు. రెండు మండలాల్లో 110 ఎకరాల విస్తీర్ణంలో పెంపకానికి గాను 90 శాతం రాయితీపై వాటిని అందించనున్నట్టు పేర్కొన్నారు. ఎస్సీపీ టీఎస్‌ఎస్ పథకం కింద ఎంపికైన రైతుకు ఎకరాకు 8వేల చొప్పున పైనాపిల్ మొక్కలు, ఎరువులు, చేతిపంపులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రైతు సేవా కేంద్రంలో ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కబళిస్తున్నాయ్..



పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- జిల్లాను పట్టిపీడిస్తున్న జ్వరాలు
- పెరుగుతున్న మలేరియా, డెంగ్యూ కేసులు
- పలువురి మృత్యువాత
- నియంత్రణ చర్యలు చేపడుతున్నా.. అదుపులోకి రాని పరిస్థితి
- ఆందోళనలో జిల్లావాసులు

పార్వతీపురం, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జ్వరాలు అదుపులోకి రావడం లేదు. నియంత్రణ చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. జ్వరాలతో పలువురు ప్రాణాలు కోల్పోవడం కలకలం రేగుతోంది. మరోవైపు మలేరియా, డెంగ్యూ కేసులు కూడా మునుపెన్నడూ లేని విధంగా నమోదవుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నా.. ఆ సమచారం బయటకు రావడం లేదు. అనధికారికంగా చూసుకుంటే.. జిల్లాలో ఎంతోమంది జ్వర లక్షణాలతో బాధపడుతున్నారు. మరోవైపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితుల వల్ల వ్యాధులు అదుపులోకి రావడం లేదు.

కేసుల నమోదు ఇలా...

జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు చూసుకుంటే 1,85,584 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. ఇందులో 1153 మందికి మలేరియా ఉన్నట్లు ప్రభుత్వ వైద్యులు గుర్తించారు. ఇందులో పీవీ 354 మందికి, పీఎఫ్ 78 మందికి ఉన్నట్లు తేలింది. డెంగ్యూకు సంబంధించి 1043 మందికి వ్యాధి పరీక్షలు నిర్వహించగా 52 మందికి ఆ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆయా రోగులకు అవసరమైన వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా అందించారు.

నిర్లక్ష్యం వీడాలి..

ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న కొంతమంది ప్రభుత్వ వైద్యులు విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆరోపణలు న్నాయి. ముఖ్యంగా గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, కొమరాడ, భామిని తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇంకొంతమంది విశాఖపట్నం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల పూర్తిస్థాయిలో రోగులకు వైద్య సేవలు అందడం లేదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో జ్వర పీడితులు సంచి డాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. మరికొందరు నాటు, పసర మందులను వాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

నిబంధనలు పాటించని వైనం..

ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరిన రోగులకు మలేరియా, డెంగ్యూ నిర్ధారణ అయితే వెంటనే ఆ సమాచారాన్ని వైద్య ఆరోగ్యశాఖకు అందించాల్సి ఉంది. కానీ ఈ నిబంధనలను ఎవరూ పాటించడం లేదు. వాస్తవంగా డెంగ్యూని నిర్ధారించాలంటే జిల్లా కేంద్ర ఆసుపత్రి లేదా పాలకొండ ఏరియా ఆసుపత్రిలోనే అవకాశం ఉంది. కానీ కొన్నిచోట్ల డెంగ్యూ లక్షణాలున్న వారికి ప్రైవేట్ వైద్యులు పరీక్షించి.. ఆ వ్యాధిని ఉన్నట్లు నిర్ధారించి వైద్యసేవలు అందిస్తున్నారు. మొత్తంగా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు వేలాది రూపాయలను వసూలు చేస్తూ.. రోగుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నాయి. వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన యంత్రాలు, ల్యాబ్‌లు పూర్తిస్థాయిలో లేక పోయినప్పటికీ.. ఏదో ఒక విధంగా నెట్టుకొస్తున్నాయి. మరికొన్నిచోట్ల ప్రైవేట్ ఆసుపత్రులు రోగులను సమీపంలో ల్యాబ్‌ల వద్దకు పంపించి.. టెస్ట్‌ల పేరిట దోపిడీకి పాల్పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. కాగా జ్వర లక్షణాలతో వెళ్లిన వారికి సకాలంలో వైద్యం అందిస్తున్నప్పటికీ ఒక్కోసారి రోగుల ప్రాణాల మీదకు తీసుకొస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వ్యాధులు అదుపులోకి వచ్చేవరకూ అంతటా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు. అదేవిధంగా ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్యసేవలు అందిస్తున్నాం..

మలేరియా, డెంగ్యూ నిర్ధారణ అయిన తర్వాత రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం. జ్వర లక్షణాలున్న వారికి రక్త పరీక్షలను నిర్వహిస్తున్నాం. మలేరియా, డెంగ్యూ వ్యాధికి గురైన వారి సమాచారాన్ని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు అదించడం లేదు. దీనిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

-విజయపార్వతి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, పార్వతీపురం మన్యం

గంటల వ్యవధిలోనే..

- జ్వరంతో తల్లీ, కూతురు మృతి
- పది రోజుల కిందట ఇంకొకరు..
- బట్లభద్రలో విషాదం
- గ్రామంలో పదుల సంఖ్యలో జ్వర పీడితులు

జియ్యమ్మవలస, ఆగస్టు 24: జియ్యమ్మవలస మండలంలో నిర్వాసిత పంచాయతీ బిత్రపాడు పరిధి బట్లభద్ర గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. గంటల వ్యవధిలోనే జ్వరంతో తల్లీ, కూతురు మృతి చెందారు. పది రోజుల కిందట అదే గ్రామంలో మరో వ్యక్తి జ్వరంతో మృతి చెందాడు. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై వైద్యశాఖ అధికారులు పట్టించుకోక పోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మరికొంతమంది జ్వర పీడితులు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

ఒకే రోజు ఇద్దరు..

బట్లభద్ర గ్రామానికి చెందిన మేరువ దుర్గమ్మ (47), ఆమె కూతురు చైతన్య (20) పది రోజుల కిందట జ్వర లక్షణాలతో చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేరారు. ఆరోగ్యం మెరుగవకపోవడంతో వారం రోజుల కిందట పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. అయితే వారి పరిస్థితి విషమించడంతో దుర్గమ్మను విజయనగరం తిరుమల ఆసుపత్రికి, చైతన్యను శ్రీకాకుళం మెడికేర్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ వారు ఆ ఆసుపత్రుల్లోనే మృతి చెందారు. దుర్గమ్మ శుక్రవారం ఉదయం చనిపోతే, కూతురు చైతన్య సాయంత్రం మృతి చెందింది. ఒకే రోజు గంటల వ్యవధిలో తల్లీ, కూతురు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు.



ఒకే రోజు మృతి చెందిన తల్లి దుర్గమ్మ, కూతురు చైతన్య (ఫైల్)

ఎవరి కోసం బతకాలి..

భార్య, కూతురు ఒకే రోజు చనిపోవడాన్ని భర్త పరందామ జీర్ణించుకోలేకపోతున్నాడు. తానింక ఎవరి కోసం బతకాలని భోరున విలపిస్తున్నాడు. వాస్తవంగా పరందామ తన ఒక్కగానొక్క కూతురు చైతన్యను బాగా చదివించాలనే ఉద్దేశంతో విజయనగరం అవంతి ఇంజనీరింగ్‌లో కాలేజీలో చేర్పించాడు. ఎకరా భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మాయ దారి జ్వరం తన భార్య కూతుర్ని ఇలా పొట్టన పెట్టుకుంటుందనుకోలేదని ఆయన కన్నీరుమున్నీరయ్యాడు. ఆయన్ని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

పదిరోజల కిందట ఒకరు..

అదే గ్రామానికి చెందిన అల్లు వెంకట రమణ (55) పది రోజుల కిందట జ్వరంతో పార్వతీపురంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి వచ్చారు. మళ్లీ పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌పై అదే ప్రైవేటు ఆసుపత్రికి ఆయన్ని తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా గ్రామానికి చెందిన ముగ్గురూ డెంగ్యూతో చనిపోయినట్లు ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు.



పది రోజుల కిందట మృతి చెందిన వెంకటరమణ (ఫైల్)

గ్రామమంతా జ్వర పీడితులే...

బట్లభద్ర గ్రామంలో జ్వర పీడితులే ఎక్కువగా ఉన్నారు. వీరిలో చాలామంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



రిట్లపాడు నుంచి రోగిని డోలీపై తీసుకొస్తున్న గిరిజనులు

డోలీ కట్టి.. కొండ దిగి..

- 15 కిలోమీటర్లు.. రాళ్లు రప్పలు దాటి..
- జ్వర బాధితుడిని పీహెచ్‌సీకి చేర్చిన గిరిజనులు

పాచిపెంట, ఆగస్టు 24: రాళ్లు రప్పలు దాటి.. 15 కిలోమీటర్లు డోలీ మోసి.. చివరకు జ్వర బాధితుడిని పీహెచ్‌సీకి చేర్చారు ఆ గ్రామ గిరిజనులు. రహదారి సౌకర్యం లేకపోవడంతో వారికి ఈ ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామంలో ఎవరు అనారోగ్యం పాలైనా డోలీ కట్టి కొండ దిగాల్సి వస్తోంది. గొట్టూరు పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామం రిట్లపాడుకు చెందిన సేబి ఆశయ్య (60) గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. శనివారం పరిస్థితి విషమించడంతో ఆ గ్రామస్థులు డోలీ కట్టి.. ఆశయ్యను మోసుకుంటూ.. సుమారు 15 కిలోమీటర్లు రాళ్లు రప్పలతో నిండిన కొండ దిగి.. గురువునాయుడుపేట పీహెచ్‌సీకి చేరుకున్నారు. ప్రస్తుతం ఆశయ్య పరిస్థితి బాగానే ఉంది. కాగా రిట్లపాడు నుంచి మైదాన ప్రాంతం చేరాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆ గ్రామ గిరిజనులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు: కలెక్టర్



పార్వతీపురం, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా ఈ నెల 26న గ్రీవెన్స్‌ను నిర్వహించడం లేదన్నారు. ఈ విషయాన్ని జిల్లావాసులు గమనించాలన్నారు.

నేడు లఖ్‌పతిదీది

జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ఆదివారం లఖ్‌పతి దీదీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మహారాష్ట్రలోని జలగాన్ గ్రామంలో పీఎం ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అన్ని మండల సమాఖ్య కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని, మహిళలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చూడాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో 5,212 మంది సభ్యులకు రూ.56.64 కోట్లు బ్యాంకు లింకేజీగా, 124 మంది సభ్యులకు సీఐఎఫ్ కింద రూ.60 లక్షలు, పీఎం ఉపాధి కల్పన కింద 117 మందికి రూ.8.90 కోట్లు అందించనున్నట్లు తెలిపారు.

గ్రామసభలు విజయవంతం

జిల్లాలో నిర్వహించిన గ్రామసభలు విజయవంతమైనట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సర్పంచ్‌ల అధ్యక్షతన శుక్రవారం 451 పంచాయతీల్లో దిగ్విజయంగా గ్రామ సభలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి పంచాయతీ నుంచి సుమారు 50 నుంచి 150 వరకు వివిధ పనులకు ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు చెప్పారు.

ప్రజా సమస్యలను పట్టించుకోరా?

- అధికారులపై జేసీ శోభిక ఆగ్రహం

భామిని: ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోరా అని జేసీ శోభిక మండల స్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కాట్రగడ ఓపెన్ హెడ్ చానల్‌ను సందర్శించారు. వరద కాలువ ముఖద్వారం వద్ద తక్షణమే ఇసుక మేటలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రహదారి మరమ్మతులు చేయాల్సి ఉందని, వర్షాలు తగ్గితే చేపడతామనడంతో ఆమె మండిపడ్డారు. మూడు రోజుల్లో రోడ్డు మరమ్మతులు చేసి.. ఇసుక డంపింగ్ చేపట్టాలని ఆదేశించారు. సుమారు లక్షా 5 వేల టన్నుల ఇసుక తీయాల్సి వస్తుందని వంశధార డీఈఈ భవానీ శంకర్ తెలిపారు. డంపింగ్ అయిన వెంటనే ఇసుక మార్కెటింగ్ బాధ్యత రెవెన్యూ, మైనింగ్ వారు చూస్తారని జేసీ తెలిపారు. అనంతరం అలికాం-బత్తిలి మార్గంలో కొరమ నుంచి బిల్లుమడ రోడ్డును ఆమె పరిశీలించారు. రహదారి పూర్తిగా పాడవ్వడంతో ఆర్‌అండ్‌బీ ఏఈ జగన్మోహన్ రాజును ప్రశ్నించారు. వెంటనే రోడ్డు ఫొటోలు, మ్యాప్‌ను అందజేయాలని ఆదేశించారు. కాట్రగడలోని పొలాల్లో వర్షపు నీరు నీల్వ ఉండిపోవడం వల్ల పంటలు నష్టపోతున్నామని రైతులు ఆమెకు తెలియజేశారు. దీనిపై ఏపీవో తులసీదాస్‌ను జేసీ ప్రశ్నించారు. తక్షణమే నీటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజలు, రైతులు సమస్యలు పట్టించుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌కు సూచించారు. ఆర్డీవో వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.


ఇండస్ట్రియల్ పార్క్ స్థలం పరిశీలన

సీతంపేట రూరల్: పాత పనుకువలస సమీపంలో ఉన్న ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని జేసీ శోభిక పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ-పంట నమోదు వేగవంతం చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వరినాట్లు పరిశీలించారు. తహసీల్దార్ అప్పలరాజు, ఏవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఇసుక తొలగింపుపై ఆదేశాలిస్తున్న జేసీ

భవిత పైనా నిర్లక్ష్యం!



- సహిత విద్య వనరుల కేంద్రాలను పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- నిర్వహణ నిధులు, అలవెన్స్‌లను సక్రమంగా జమ చేయని వైనం
- ఇబ్బందుల్లో ప్రత్యేక అవసరాల పిల్లలు

గరుగుబిల్లి: జిల్లాలో సహిత విద్య వనరుల కేంద్రాలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన వాటిపై గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం వహించింది. దీంతో వాటి పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో 15 భవిత కేంద్రాలు ఉండగా.. వాటిల్లో 286 మందికి పైగా ప్రత్యేక అవసరాల గల పిల్లలు ఉన్నారు. ఈ ఏడాది మరో 82 మందికి పైగా దివ్యాంగులను గుర్తించారు. వీరికి 20 రకాల సేవలను సిబ్బంది అందిస్తున్నారు. ఆరేళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు వారికి నిబంధనల మేరకు వాటిల్లో ప్రవేశాలు కల్పిస్తారు. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే చిన్నారులకు ఆట పాటల ద్వారా తరగతులు నిర్వహి స్తారు. అవసరమైన వారికి ఫిజియోథెరపీ సేవలు అందిస్తారు. కాగా సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నడిచే సహిత విద్యా వనరుల కేంద్రాలకు నిధుల సమస్య వెంటాడుతుంది. గత వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణను గాలి కొదిలేసింది. ప్రత్యేక అవసరాలతో సతమతమయ్యే వారికి అవసరమైన సామగ్రి అందించడంలోనూ విఫలమైంది. వాస్తవంగా దివ్యాంగ పిల్లలు కేంద్రాలకు వచ్చి వెళ్లేందుకు ప్రతి నెలా రూ. 300లు రవాణా సౌకర్యానికి, హోం బెస్ట్ అలవెన్స్‌గా రూ.300, ఎస్కార్ట్ అలవెన్స్‌గా రూ. 300 తల్లుల ఖాతాలకు జమ చేయాల్సి ఉంది. అయితే కొవిడ్ సమయంలో ఒక సారి, ఎన్నికలకు ముందు మరోసారి మాత్రమే జమ చేశారు. ఆ తర్వాత వాటిపై వైసీపీ సర్కారు దృష్టి సారించలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దివ్యాంగ విద్యార్థులు, సహాయకులకు ప్రతి నెలా వారి ఖాతాల్లో నగదు జమయ్యేది. కేంద్రం నిర్వహణకు ఏటా రూ. 10 వేలు మంజూరు చేసేవారు. అవసరమైన ఫిజియోథెరిఫీతో పాటు విజ్ఞానం కలిగేలా పలు రకాల సేవలు, పరికరాలు అందించి ప్రోత్సహించే వారు. కేంద్రాలకు పూర్తిస్థాయిలో బోధన సామగ్రిని సమకూర్చేవారు. అయితే గత వైసీపీ సర్కారు ఆ సేవలకు మంగళం పాడేసింది. ఐదేళ్లు భవిత కేంద్రాలను పట్టించుకోలేదు. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో అందరిలోనూ ఆశలు చిగురిస్తున్నాయి. వనరుల కేంద్రాలకు వెలుగులు వచ్చే అవకాశం ఉందని, దివ్యాంగుల భవిష్యత్ కోసం ప్రభుత్వం తగు చర్యలు చేపడుతుందన్న ఆశతో తల్లిదండ్రులు, సిబ్బంది ఉన్నారు.



గరుగుబిల్లిలో సహిత విద్య వనరుల కేంద్రం



ప్రత్యేక అవసరాలు విద్యార్థులకు బోధిస్తున్న సిబ్బంది

ఉన్నతాధికారులకు నివేదించాం

సహిత విద్యా వనరుల కేంద్రాల్లోని ప్రధాన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. విద్యార్థులకు సంబంధించిన మొత్తాలు రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయం (ఎస్‌పీడీ) నుంచి నేరుగా వారి ఖాతాల్లోకి జమవుతాయి. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కేంద్రాలకు ప్రత్యేక అవసరాల గల పిల్లలు వచ్చేలా చేస్తున్నాం. ఐదుగురు ఫిజియోథెరిఫిస్టులు ఉండగా.. ఒక్కొక్కరికీ మూడేసి మండలాలను కేటాయించాం.

- పి.భానుమూర్తి, జిల్లా కోఆర్డినేటర్ (సహిత విద్య), పార్వతీపురం మన్యం



ఏపీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రానికి 4087 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.

అర్హత: విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు; వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.

రాత పరీక్ష: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్ట్‌లో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్: రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసేవరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12,000 ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZbiB0SEలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఏపీ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్)/ ఏఎన్ఎం ట్రెయినింగ్

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం(సీహెచ్&ఎఫ్‌డబ్ల్యూ)- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 2,330 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లన్నీ ఉచితమే. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం సీట్లు ఉచితం కాగా మిగిలిన 40 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు చెందుతాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి నిర్దేశిత ధ్రువ పత్రాలు జతచేసి సంబంధిత జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21 నుంచి
- **వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

పీహెచ్‌డీ

జేఎన్‌టీయూ అనంతపురంలో..

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్‌లు, రీసెర్చ్ ప్రొఫెషనల్స్, పబ్లిక్ రిప్రజంటేటివ్‌లు దరఖాస్తు చేసుకోవచ్చు.

రీసెర్చ్ విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఫార్మసీ.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు; ప్రైవేట్ ఇండస్ట్రీల్లో ఎగ్జిక్యూటివ్ కేడర్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

- **స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూ, అనంతపురం-515002
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in



కర్నూలు ఐఐఐటీడీఎంలో..

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎం)- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ స్కీమ్ కింద ఫుల్ టైమ్ పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈ)

సైన్స్ విభాగాలు: ఫిజిక్స్, మేథమెటిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కనీసం 7 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఏదేని ఇంజనీరింగ్ కళాశాల నుంచి 75 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- సైన్స్ విభాగాలకు సంబంధిత మాస్టర్స్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/నెట్/ఎన్‌బీహెచ్ఎం స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులు; ఐఐటీల నుంచి 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: ఎంపికైన అభ్యర్థులకు విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి రెండేళ్లు నెలకు రూ.43,750 అందిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు అటెండ్ అయ్యే వారికి రూ.లక్షన్నర ఇస్తారు.

- **చివరి తేదీ:** సెప్టెంబరు 8
- **వెబ్‌సైట్:** iiitk.ac.in/


నవ్య | చిత్రజ్యోతి

నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి

● అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

పవన్ కల్యాణ్, నాగబాబు, అల్లు అర్జున్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలతో మెగా ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయంటూ కొన్నాళ్లుగా మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఇప్పటి దాకా మెగా, అల్లు కుటుంబాల నుంచి ఎవరూ నేరుగా పెదవి విప్పింది లేదు. కానీ ఇప్పుడు తొలిసారి అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఈ విషయంపై స్పందించారు. ఓ మీడియా ఛానల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పుడు హీరోలు స్మగ్లర్ల వేషాలు వేస్తున్నారు' అంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు, 'స్నేహితుల కోసం ఎక్కడిదాకా అయినా వస్తాను' అంటూ అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

- కల్యాణ్ గారు ఏ సందర్భంలో అలా మాట్లాడారో తెలియదు. ఆయన మాటవరసకు అలా అని ఉంటారు అని నేను అనుకుంటున్నాను. కానీ ప్రజల్లోకి తప్పుడు సందేశం పోతోంది. తర్వాతైనా ఆయన 'నా ఉద్దేశం ఇది' అని చెబితే బాగుండేది. ఆయనే స్వయంగా పూనుకొని సరిదిద్దితే బాగుండేదని నా అభిప్రాయం.



- ఎన్టీఆర్ నటుడిగా రావణుడు, దుర్యోధనుడి పాత్రలు పోషించారు. అంటే దానర్థం మొత్తం స్త్రీ జాతిని ఆయన కించపరిచాడని కాదు కదా. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి కూడా అయ్యారు. పవన్ కల్యాణ్ కూడా నటుడిగా ఉండి రాజకీయ నాయకుడయ్యారు. సినిమా యాక్టర్‌ను యాక్టర్‌గానే చూడాలి. వారి వ్యక్తిత్వాలకు ఆ పాత్రల స్వభావాన్ని అంటగట్టే ప్రయత్నం చేయకూడదు. అల్లు అర్జున్ నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి.
- అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడి అవార్డ్ వచ్చింది. 69 ఏళ్లలో ఎవరికీ రాని అవార్డ్ ఆయన్ను వరించింది. ఆయన మిత్రపక్షం బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఎన్డీయే ప్రభుత్వమే అర్జున్‌కు ఉత్తమ నటుడు అవార్డ్ ఇచ్చింది. అది పవన్ కల్యాణ్‌కు తెలియదా? మంచీ చెడూ చూడకుండానే భారత ప్రభుత్వం ఆ పురస్కారాన్ని ఇవ్వలేదు కదా?. ఆయన అభిమానులేమో అల్లు అర్జున్‌నే అన్నాడు అని అనుకుంటున్నారు. ఇప్పుడు ఈ వివాదానికి శుభంకార్డు పడాలంటే 'ఇది నేను జనరల్‌గా అన్నాను' అని పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేయాలి. లేదంటే ఆయన భాగస్వామిగా ఉన్న ఎన్డీయే ప్రభుత్వాన్ని తప్పు పట్టినట్లే. భారత ప్రభుత్వ నిర్ణయాన్ని వివాదాస్పదం చేస్తున్నట్లుగానే భావించాలి. చిరంజీవి గారు పవన్ కల్యాణ్, అల్లు అర్జున్‌తో మాట్లాడి ఈ వివాదానికి ముగింపు పలకాలి.



బ్రదర్.. తప్పకరావాలి!

కమర్షియల్ తెలుగు సినిమాకు ఒక ఊపుని తెచ్చి, బాక్సాఫీసు దగ్గర సునామీ సృష్టించిన హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ. వయసుతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తూ దూసుకుపోతున్నారు. ఎన్నోసార్లు బాక్సాఫీసు దగ్గర వీరిరువురి చిత్రాలూ పోటీ పడినప్పటికీ ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా, ఒకరి మీద మరొకరు ప్రత్యేక అభిమానం కురిపిస్తూ మంచి స్నేహితులుగా మెలుగుతుంటారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భేదం ఈ ఇద్దరి హీరోలలోనూ లేదు. వృత్తిపరమైన పోటీని సినిమాలకే పరిమితం చేసి నిజజీవితంలో ఎంతో ఎమోషనల్ బాండింగ్ కలిగి ఉంటారు చిరంజీవి, బాలకృష్ణ. గురువారం రాత్రి జరిగిన గీత రచయిత రామజోగయ్యశాస్త్రి ఇంట జరిగిన వివాహ వేడుకలో ఈ అనుబంధం మరోసారి ఆవిష్కృతమైంది. ఈ వేడుకకు చిరంజీవి, బాలకృష్ణ హాజరయ్యారు. చిరంజీవి ఎదురు పడగానే 'బ్రదర్.. ఎలా ఉన్నారు?' అని ఆప్యాయంగా పలకరించారు బాలకృష్ణ. ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్న తర్వాత సెప్టెంబర్ ఒకటిన జరిగే తన సన్మాన కార్యక్రమానికి తప్పకుండా రావాలని చిరంజీవిని ఆహ్వానించారు. వస్తానని చిరంజీవి చెప్పారు. అలాగే 'అన్‌స్టాపబుల్' కార్యక్రమం గురించి కూడా వీరిద్దరి మధ్య సంభాషణ జరిగిందని సమాచారం.

కాలం కలిసొస్తే నడిచొచ్చే సినిమా



నాని హీరోగా నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'సరిపోదా శనివారం' ఈ నెల 29న విడుదల కానుంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నాని మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి చాలా చెప్పేశాను. దర్శకుడు వివేక్ ఇందులో శివ తాండవం చూపించాడు. అతని కెరీర్‌కి ఈ సినిమా ఓ మైల్‌స్టోన్. మా కష్టాన్ని చూసి మీరు ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నా. కాలం కలసి వస్తే నడిచి వచ్చే సినిమా వస్తుందంటారు. అటువంటి సినిమానే 'సరిపోదా శనివారం' అన్నారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'మా దర్శకుల కుటుంబం అంతా ఈ వేడుకకి వచ్చి ఆశీస్సులు అందజేశారు. ఈ సినిమా 29న విడుదల చేయడానికి దర్శకుల టీమ్ కూడా ఓ కారణం. నాని నా మీద ఉంచిన నమ్మకానికి 'సరిపోదా శనివారం' ఇచ్చా' అన్నారు. 'ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది. నాని కథల ఎంపికలో బెస్ట్. కథ నచ్చితే కొత్త దర్శకుడైనా అవకాశం ఇస్తారు. ఆయనతో సినిమా చేస్తే నిర్మాతకు ఏ టెన్షన్ ఉండదు' అన్నారు నిర్మాత దానయ్య. ఒక రకమైన యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు వివేక్ విభిన్నంగా మలిచారని ఎస్.జె.సూర్య ప్రశంసించారు.



ఇన్ ప్రోగ్రెస్

టైటిల్ సాంగ్ వచ్చేసింది



బిగ్‌బాస్ ఫేమ్ గౌతమ్‌కృష్ణ హీరోగా నవీన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సోలో బాయ్'. సతీశ్ కుమార్ నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌గా టైటిల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి సబ్జెక్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ మూవీలో చాలా ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి" అని చెప్పారు.

మహిళలకు మాత్రమే



నూతన నటీనటులతో తెరకెక్కిన చిత్రం 'ఎంత పనిచేశావ్ చంటి'. ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ నిర్వహించింది. దర్శకుడు నక్కిన త్రినాథరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న కథతో 'ఎంత పనిచేశావ్ చంటి' చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమాను మగవాళ్లు చూడకూడదు. మహిళలు మాత్రమే చూడాలి' అని అన్నారు. శ్రీనివాస్‌ఉలిశెట్టి, దియారాజ్, నిహారిక శాంతిప్రియ జంటగా నటించారు. సంగీతం: పవన్ సినిమాటోగ్రఫీ: సంతోష్.

పెద్ద హిట్టవ్వాలి



లక్షణమూర్తి రతన, భ్రమరాంబిక తూటిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సీతారామ్ సిత్రాలు'. డి.నాగ శశిధర్ రెడ్డి దర్శకత్వంలో పి.పార్థసారధి, డి.నాగేంద్ర రెడ్డి, కృష్ణ చంద్ర విజయబట్టు నిర్మిస్తున్నారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్ జగన్నాథ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

అందరూ ప్రశంసిస్తున్నారు



ఇటీవలే 'ఆయ్' సినిమాకు ఆకట్టుకునే సంగీతాన్ని అందించారు అజయ్ అరసాడ. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను 'ఆయ్' చిత్రంలో సంగీతం అందించిన మూడు పాటలు అందరికీ విపరీతంగా నచ్చాయి. పాటలతో పాటు నేపథ్య సంగీతానికి విశేషాదరణ లభిస్తోంది. ఎంతో మంది మంచి సంగీతం ఇచ్చావని ప్రశంసిస్తున్నారు. ఓ సంగీత దర్శకుడిగా అన్ని జోనర్ సినిమాలు చేయాలనుంది. ప్రస్తుతం రెండు చిత్రాలకి సంగీతం అందిస్తున్నాను" అని చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో...



తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించిన చిత్రం 'బంపర్'. ఇప్పుడు అదే పేరుతో తెలుగులోనూ రాబోతోంది. వెట్రి, శివాని నారాయణ్ ముఖ్య పాత్రలు పోషించారు. ఎమ్. సెల్వకుమార్ దర్శకత్వం వహించారు. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సెల్వకుమార్ మాట్లాడుతూ "ఓ లాటరీ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో వినోదంతో పాటు బోలెడు థ్రిల్లింగ్ అంశాలు ఉంటాయి" అని చెప్పారు.

సోషల్ మీడియా టు సినిమా

ఒకప్పుడు సినిమాల్లోకి రావాలంటే చాలా తతంగం ఉండేది. ఫొటోల ఆల్బమ్ చేత్తో పట్టుకుని ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ఫొటోలు నచ్చితే ఆడిషన్స్‌కు పిలుపు వచ్చేది. ఆడిషన్స్‌లో ఓకే అనిపించుకున్నా అవకాశం వస్తుందో రాదో తెలియని పరిస్థితి.. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆర్టిస్టులను ఎంపిక చేసే విధానమూ మారింది. సోషల్‌మీడియాలో కొంత హల్‌చల్ చేస్తే చాలు సినిమాల్లో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చేస్తున్నాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లే వేదికగా తమ టాలెంట్ ప్రదర్శించి, సినిమాల్లోకి ఎంట్రీ సంపాదించిన నటీమణులు కొందరున్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం.

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో డ్యాన్స్ రీళ్లతో అదరగొడుతూ లక్షలాది మందిని ఆకర్షించారు ఇమాన్ ఇస్మాయెల్ (ఇమాన్వీ). రీల్స్ చేయడమే కాకుండా ఆమె ఓ షార్ట్ ఫిల్మ్‌లోనూ నటించారు. యూట్యూబ్‌లో దాదాపు రెండు మిలియన్ల సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాలో దాదాపు తొమ్మిది లక్షల ఫాలోవర్లు ఆమెకు ఉన్నారు. దాంతో ఇప్పుడీ ఢిల్లీ భామ ఏకంగా ప్రభాస్ సరసన నటించే లక్కీ ఛాన్స్ పొందింది. తొలి సినిమానే పాన్ ఇండియా ఫిల్మ్ కావడం గ్రేట్ కదా! 1940ల నేపథ్యంలో హిస్టారికల్ డ్రామాగా ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకుడు.

గీతా ఆర్ట్స్‌లో..

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు, రీల్స్ ద్వారా ఫేమస్ అయిన మరో కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్.ఎమ్. ఆమె కూడా నటిగా టాలీవుడ్‌లోనూ.. కోలీవుడ్‌లోనూ అడుగుపెట్టనున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ నిర్మించే ఓ తెలుగు చిత్రంలో.. ఆకాశ్‌భాస్కర్ దర్శకత్వంలో అధర్వ హీరోగా ఓ తమిళ సినిమాలోనూ నటిస్తున్నారు. నిహారిక ఇటీవలే అమెరికన్ యానిమేటెడ్ కామెడీ టెలివిజన్ సిరీస్ 'బిగ్ మౌత్' సీజన్ 7లో ఓ క్యారెక్టర్‌కు వాయిస్ కూడా అందించడం విశేషం. పలు సామాజిక సమస్యలపై సోషల్ మీడియాలో అవగాహన వీడియోలు చేసే నిహారికకు యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లు మిలియన్లలో ఉన్నారు.

'బేబీ' కాంబోలో..

సోషల్ మీడియాను తెలివిగా వాడుకుని సినిమాల్లో ఎంట్రీ కార్డ్ దక్కించుకున్న తెలుగమ్మాయి అలేఖ్య హారిక (దేత్తడి హారిక). యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్.. కవర్ సాంగ్స్.. వెబ్ సిరీస్‌లలో నటించి పాపులర్ అయ్యారు. ఆమె ప్రస్తుతం సంతోష్ శోభన్ హీరోగా సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్.కే.ఎన్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు.

వరుసగా నాలుగో చిత్రం

సోషల్ మీడియాతో వరుస అవకాశాలు తెచ్చుకున్నారు కేరళకు చెందిన అనంతిక సనీల్‌కుమార్. కంటెంట్ క్రియేటర్‌గా ఓ వైపు రాణిస్తూనే.. క్లాసికల్ డ్యాన్సర్‌గా.. కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డర్‌గా పలు రంగాల్లో పట్టు తెచ్చుకున్నారు. ఇప్పటికే మూడు చిత్రాల్లో నటించారు. 'రాజమండ్రి రోజ్‌మిల్క్' చిత్రంతో తెరంగేట్రం చేసి.. 'మ్యాడ్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ప్రస్తుతం 'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి దర్శకత్వం వహిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

వీళ్లతో పాటు సోషల్‌మీడియాను కేరాఫ్ అడ్రస్‌గా వాడుకుని ఇప్పటికే ఎంతో మంది తారలు సినిమాల్లో అవకాశాలు పట్టేశారు. వారిలో 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ఒకరు. షార్ట్ ఫిల్మ్స్.. సినిమాల్లో అతిథి పాత్రల్లో నటించిన ఆమె కెరీర్‌ను 'బేబీ' సినిమా సక్సెస్ ఒక్కసారిగా మార్చేసింది. వైష్ణవిని ఓవర్‌నైట్ స్టార్‌ను చేసి వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది. మరో నాయిక రుహాని శర్మ కూడా సోషల్ మీడియా నుంచి వెండితెర ప్రయాణం చేసి 'ఇచ్చట వాహనాలు నిలుపరాదు' 'చి.ల.సౌ. స్రవంతి' చిత్రాలలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మోడల్‌గా ట్రయిల్స్ దశలో ఉన్న సాక్షి వైద్య సోషల్‌మీడియాలో తన ఫొటోల ద్వారా సినిమా అవకాశాలు దొరకబుచ్చుకున్నారు. అలా ఆమె 'ఏజెంట్' చిత్రంలో తళుక్కుమన్నారు. ఆ సినిమా సక్సెస్ కాకపోయినా.. ఈ అమ్మడుకు మాత్రం మరో రెండు క్రేజీ ప్రాజెక్ట్ లైన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ కోవలోకి చెందిన వారే.. 'బీస్ట్' ఫేమ్ అపర్ణా దాస్, 'రొమాంటిక్', 'అంగరంగ వైభవంగా' ఫేమ్ కేతిక శర్మ, 'టాక్సీవాలా' ఫేమ్ ప్రియాంక జవాల్కర్. ఇలా ఎంతో మంది సోషల్ మీడియా స్టార్స్‌కు సినిమా తలుపులు తెరుస్తూనే ఉంది. మరి వీరిలో ఎంత మంది హీరోయిన్లుగా నిలబడతారో వేచి చూడాలి.















గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు

- జిల్లాలో పీఎం జన్‌మన్ అమలుకు చర్యలు
- పైలట్ ప్రాజెక్టు కింద 5 మోడల్ గిరిజన గ్రామాలు ఎంపిక
- జేసీ సేతు మాధవన్


మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

కలెక్టరేట్, ఆగస్టు 24: ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం ద్వారా కొన్ని ప్రత్యేక గిరిజన తెగ(పీవీటీజీ) అభివృద్ధికి, వారి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని జేసీ సేతుమాధవన్ కోరారు. దీని కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గబద తదితర అతి సున్నిత గిరిజన తెగలు నివసించే గ్రామాలు జిల్లాలో 52 వరకూ ఉన్నాయని చెప్పారు. వీటిలో ఎస్.కోట మండలం కొత్తపాలెం, పుణ్యగిరి, వేపాడ మండలం ఆకులకట్ట, తెర్లాం మండలం తమ్మయ్యవలస గ్రామాలను నమూన గ్రామాలుగా ఎంపిక చేశామని తెలిపారు. పీఎంజన్‌మన్ కార్యక్రమం అమలుపై ఆయా శాఖ అధికారులతో శనివారం సాయంత్రం ఆయన కార్యాయలంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అతిసున్నిత గిరిజన తెగల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని, దీని కోసం ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం క్రింద ఈ తెగలు నివశించే గ్రామాల్లో విద్య, వైద్యం, ఆరోగ్యం గృహ నిర్మాణం, తాగునీరు సరఫరా, విద్యుత్, పౌష్టికాహారం, రహదారులు తదితర మౌలిక సదుపా యాలు కల్పిస్తామన్నారు. ఆయా శాఖ అధికారులు ఈ 52 గ్రామాల్లో పర్య టించి 15 రోజుల్లో ప్రతిపా దనలు తయారు చేయాలని సూచించారు. పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భా గంగా సెప్టెంబరు మొదటి వారంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామని, దీని కోసం ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గిరిజన సంక్షేమాధికారి రామా నందం, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌రావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు ఉన్నారు.

వేకువన పెళ్లి.. ఉదయం ప్రమాదం

- మామిడిపల్లి వద్ద గోడను ఢీకొన్న పెళ్లి వాహనం
- వరుడు, వధువు సహా ఆరుగురికి గాయాలు



ఘటనా స్థలంలో వాహనం, గాయపడిన వరుడు, వధువు

సాలూరు రూరల్, ఆగస్టు 24: నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో శనివారం వేకువన అంగరంగ వైభవంగా పెళ్లి జరిగింది. కానీ ఆ సంతోషం గంటలోనే ఆవిరయ్యింది. పెళ్లి మండపం నుంచి వధువు ఇంటికి బయలుదేరిన పెళ్లి బృందం ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి గోడను ఢీకొంది. ఈ ఘటనలో వధువరులతో పాటు మరో నలుగురు గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గం కొండవెలగాడలో అదే గ్రామానికి చెందిన సాడి రాజశేఖర్‌రెడ్డితో సాలూరు మండలం భూతాడక్రివలసకు చెందిన వధువు చల్లా అనురాధతో శనివారం తెల్లవారు జామున వివాహం జరిగింది. పెళ్లి అనంతరం ఆచారం ప్రకారం అత్తారింటిలో అడుగు పెట్టడానికి ఉదయం బొలెరో వాహనంలో భార్య,అత్తామామ,బంధువులతో కలసి వరుడు రాజశేఖరరెడ్డి భూతాడక్రివలసకు పయనమయ్యారు. ఈ వాహనం మామిడిపల్లి వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి విద్యుత్ సబ్‌స్టేషన్ గోడను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వరుడు రాజశేఖర్‌రెడ్డి, వధువు అనురాధ, మామ చల్లా తౌడు, అత్త చల్లా రాజేశ్వరి, వాహన డ్రైవర్ బాసి శ్రీనివాసరావు, బంధువు బి. గౌరీశంకర్‌కు గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం వరుడు రాజశేఖర్‌రెడ్డి, అత్త రాజేశ్వరి, డ్రైవర్ శ్రీనివాసరావును విజయనగరం మహారాజ జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. సాలూరు రూరల్ సీఐ పి. రామకృష్ణ ఆసుపత్రికి వచ్చి బాధితుల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ ఘటనపై సాలూరు రూరల్ హెచ్‌సీ వి.బంగారురాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈపీడీసీఎల్ సీవీఓగా రామకృష్ణప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులైన కె.రామకృష్ణప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి సర్కిళ్ల వినియోగదారులు దీర్ఘకాలకంగా పరిష్కారం కాని విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన ఫిర్యాదులు టోల్ ఫ్రీ నంబరు 1912కి తెలియజేయాలని కోరారు.

భగవంతునిపై విశ్వాసం అవసరం

రేగిడి: భగవంతునిపై విశ్వాసం చెక్కు చెదరకుండా ఉండాలని, అప్పుడే మానవ జీవితానికి సార్థకత ఉంటుందని పాలకొండకు చెందిన సత్యసాయి ప్రతినిధి ఎన్వీ రమణ, బి.త్రినాథరావు తదిత రులు పేర్కొన్నారు. గోపంపేటలో శనివారం సత్యసాయి వ్రతాలు, ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. దేవుదళ గీతామందిర కన్వీనర్ గొర్లి దామోదర్, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

రామభద్రపురం: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్‌ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కక్షలు, కార్పణ్యాలు విడనాడి, ప్రజలంతా శాంతియుత జీవనం సాగించాలని కోరారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతానని అన్నారు.

రేపు ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ రద్దు

విజయనగరం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌సెల్) కార్యక్రమాన్ని కృష్ణాష్టమి సందర్భంగా రద్దు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవుగా పరిగణిస్తూ, ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని, ప్రజలు ఇబ్బందులకు గురికావద్దని తెలిపారు.

నేటి నుంచి నేత్రదాన పక్షోత్సవాలు

కలెక్టరేట్: జిల్లాలోని నేత్రదాన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని జేసీ సేతు మాదవన్ కోరారు. ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 8వ తేది వరకూ నిర్వహించే ఈ పకోత్సవాల్లో భాగంగా ప్రజలుకు అవగాహన కల్పించాలని కోరారు. వీటికి సంబంధించిన కరపత్రాలను శనివారం సాయంత్రం జేసీ తన చాంబర్‌లో ఆవిష్కరించారు.

జేఎన్‌టీయూలో అవగాహన సదస్సు

విజయనగరం రూరల్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక గురజాడ విశ్వవిద్యాలయంలో శనివారం సీఎఫ్‌డీ బేస్డ్ ఆఫ్ మెకానికల్ సర్క్యూటరీ సపోర్టు సిస్టమ్స్ ఫర్ ది హ్యూమన్ బాడీ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ ప్రసాద్ పట్నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ (సీఎఫ్‌డీ), బయోమెడికల్ ఇంజనీరింగ్‌లో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఆప్టిమైజేషన్‌లో సీఎఫ్‌డీ ఉపయోగంపై తన పరిశోధన ఫలితాలను పంచుకున్నారు. ఈ వ్యవస్థలు తీవ్రమైన గుండె వైఫల్యంతో బాధ పడుతున్న రోగులకు తాత్కాలిక సాయం అందించడంలో కీలకంగా కానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీతో పాటు, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రినిపాల్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు అవసరం

బాడంగి: పత్తి పంటలో యాజమాన్య పద్ధతులతో ఎంతో మేలు జరుగుతుందని ఏవో కె.శిరీష అన్నారు. గొల్లాదిలో శనివారం పత్తి పంటను పరిశీలించి.. రసం పీల్చే పురుగుల నివారణ పద్ధతులను రైతులకు వివరించారు. రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ పి.సతీష్ పాల్గొన్నారు.

బాణసంచా తయారీకి అనుమతి తప్పనిసరి

కొత్తవలస: ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తవలస సీఐ షణ్ముఖరావు శనివారం తెలిపారు. గతంలో అనుమతులు లేకుండా బాణసంచా తయారీ చేస్తూ పట్టుబడిన పాత నేరస్థులతో పాటు మరికొంతమంది అనుమానితులను పిలిపించి హెచ్చరించారు. బాణసంచా తయారీకి సంబంధించిన సామగ్రిని నిల్వ ఉంచడం గాని, బాణసంచా తయారు చేయడం గాని చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సోషల్ ఆడిట్ కో ఆర్డినేషన్ సమావేశం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో 2023-2024 సోషల్ ఆడిట్ నిమిత్తం గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. మండలంలోని గ్రామ పంచాయతీలకు విడుదలైన ప్రభుత్వ నిధులు, వాటి వినియోగంపై, ముఖ్యంగా ఉపాధిహామీ పథకం కింద అమలు చేయబడిన పనులకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు మొదలైన వాటి ధృవీకరణ తర్వాత పని సైట్ యొక్క ధృవీకరణ, జాబ్ కార్డ్ లు తదితర విషయాలపై చర్చించారు. వేతనాల చెల్లింపులో జాప్యం, చనిపోయిన వారికి చెల్లింపులు, అనుమతి లేని పనుల ఎంపిక, అదే పనికి రెండు సార్లు చెల్లింపు తదితర అంశాలను పరిగణన లోనికి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ కె. మన్మథరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రవణ్‌కుమార్, హౌసింగ్ ఇంజినీరు, ఏపీవో ఉపాధి హామీ, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం: బేబీనాయన


చెక్‌డ్యాం నిర్మాణాలపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఇరిగేషన్ అధికారులు

రామభద్రపురం: రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తుందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. కోటశిర్లాం, పాడివానివలస గ్రామాల్లో ఏడొంపులగెడ్డపై నిర్మించాల్సిన చెక్‌డ్యాంలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రైతులకు సాగునీరు అందకుండా పోయిందని, దీని వల్ల వేలాది ఎకరాలు బీడుగా మారిపోయాయని ఆరోపించారు. సీఎం చంద్రబాబునాయుడు నదుల అనుసంధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. కోటశిర్లాంలోని జంతిగెడ్డ వద్ద చెక్‌డ్యాం నిర్మిస్తే కొత్తరేగ, దుప్పలపూడి గ్రామాల రైతులకు సాగునీరు అందుతుందని ఏఈఈ హరిబాబు ఎమ్మెల్యేకు తెలిపారు. దీని కోసం సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం పాడివానివలసలో ఉన్న కోనేటి గెడ్డను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చెక్‌డ్యాంలకు ప్రతిపాదనలు అందించాలని ఎమ్మెల్యే బేబీనాయన ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణ, కనిమెరక శంకరరావు, తాడ్డి శ్రీనివాసరావు, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చెక్ డ్యాంల పరిస్థితి తెలుసుకునేందుకు ఎమ్మెల్యే బేబీనాయన పొలం గట్లపై 3 కిలోమీటర్ల దూరం నడచి వెళ్లారు. తాను కూడా వ్యవసాయం చేస్తున్నానని.. రైతుల బాధలు తెలుసునని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ


మల్లమ్మదేవి కోనేరులో గంబూషియా చేపలను వదులుతున్న దృశ్యం

బొబ్బిలి: దోమల లార్వా నిర్మూలనకు గంబూషియా చేపలు ఉపయోగపడతాయని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అన్నారు. స్థానిక రాణిమల్లమ్మదేవి మున్సిపల్ పార్కులో గల కోనేరులో శనివారం గంబూషియా చేపలను ఆమె విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, పర్యా వరణ ఇంజనీర్ సోమేశ్వరరావు, మలేరియా సబ్ యూనిట్‌కు చెందిన ఎంఎస్ యూవో బి.బలరాం నాయుడు, ఎంపీహెచ్ఎస్ ఎస్.రాంబాబు, ఎంపీహెచ్ఏ పైడపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి


సీఐటీయూ నిరసన

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం బూర్జవలస గ్రామంలో శనివారం సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.గోపాలం ఆధ్వర్యంలో పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారని, ఇటీవల అచ్యుతాపురంలో జరిగిన ఘటన ఇందుకు తార్కాణమన్నారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేకపోవడం వల్లే నిరంతర ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఫార్మా కంపెనీలపై దృష్టి సారించాలని కోరారు. భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యకర్తలు, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు రాజాం రచయితల వేదిక సమావేశం

రాజాం: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాజాం రచయితల వేదిక సమావేశం జరుగుతుందని వేదిక నిర్వాహకడు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. పొట్నూరు కోటిబాబు అధ్యక్షత వహిస్తారని, 'కొండ పొలంలో వ్యక్తిత్వ విలువలు' అనే అంశంపై ప్రముఖ సాహితీవేత్త మూడడ్ల శ్రీనివాసరావు ముఖ్య ప్రసంగం చేస్తారని వివరించారు.

రహస్య సమావేశాలెందుకు?

- లొట్లపల్లి పశువుల సంత రెన్యువల్‌పై చర్చ


ఎంపీడీవో కార్యాలయంలో లొట్లపల్లి పశువులసంత కమిటీ సమావేశం

జామి: లొట్లపల్లి పశువుల సంత నిర్వహణకు అనుమతులు లేవని.. అక్రమంగా అనుమతులు ఇచ్చేందుకు సహకరిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గత ఏడాది కాలంగా రాష్ట్ర గో సంరక్షణ సమాఖ్య పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తోంది. ఇంతలోనే మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లొట్లపల్లి సంత నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గోప్యంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరు కావాలని కమిటీ సభ్యులకు లేఖలు పంపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏ సమావేశం జరిగినా ముందుగా మీడియాకు సమాచారం ఇచ్చే అధికారులు.. ఈసారి మాత్రం ఇవ్వలేదు. ఇది తెలుసుకున్న విలేకరులు వెళ్లే సమయానికి సంత రెన్యూవల్ విషయంపై చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో రవాణా, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు. ఇంకా రెండు శాఖలకు చెందిన సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేశారు. ఈ విషయమై ఈవోపీఆర్‌డీ శ్రీదేవిని వివరణ కోరగా.. ఇది మాములు సమావేశమని.. విలేకరులకు చెబుదామనుకొని మరిచిపోయామని చెప్పడం విశేషం. 'ఈ సమవేశంలో గోప్యత లేదు. కమిటీ సభ్యులు వచ్చారు'గా అంటూ ఈవోపీఆర్‌డీ ఎదురు ప్రశ్నించారు. సమావేశం జరుగుతున్న సమయంలో తహసీల్దార్ కృష్ణలత వచ్చి ప్రభుత్వం సూచించిన విధంగా సంత నిర్వహించాలన్నారు. పంచాయతీపై ఫిర్యాదులు వచ్చాయని.. వాటిని సహించబోమని చెప్పి వెళ్లిపోయారు. ఈ విషయమై లొట్టపల్లి యువత మాట్లాడుతూ గత జూన్ నుంచి సంతకు ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సంత నిర్వహణ, అనుమతుల వంటి విషయాలపై కలెక్టర్ ప్రత్యేక కమిటీతో దర్యాప్తు చేయించాలని కోరారు.

వెలగవలసలో ఆర్డీవో పర్యటన


లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో సుధారాణి

తెర్లాం: కుల ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్నవారి వారి వివరాలను సరిచూసేందుకు ఆర్డీవో ఎం.సుధారాణి వెలగవలస గ్రామానికి వెళ్లారు. ఈ గ్రామం నుంచి ఎక్కువ దరఖాస్తులు రావడంతో శనివారం లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. ఆమె వెంట తహసీల్దార్ హేమంత్‌కుమార్, రెవెన్యూ అధికారులు ఎల్.గణపతి, ఆర్.రామయ్య పి.రోజా, ఎస్.శ్రీనివాసరావు, వీఆర్ఏ జనార్దన్ హాజరయ్యారు.

62 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

శృంగవరపుకోట రూరల్: సంతగైరమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బంగారునాయుడు ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన సీబీసీఎస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ సంస్థ డాక్టర్ అనుపమ మొత్తం 62 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామమూర్తి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాట్ చెల్లించాలంటూ వేధింపులు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 24: వ్యాట్ చెల్లించాలంటూ వాణిజ్య పన్నుల శాఖాధికారులు తమను వేధిస్తూ, అయోమయానికి గురిచేస్తున్నారని ఏపీఎస్ఆర్టీసీ అద్దెబస్సుల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాంబాబు ఆరోపించారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడా ఈ విధానం అమల్లో లేదని, జిల్లాలో మాత్రమే ఏవేవో కారణాలు తెలియజేస్తూ వ్యాట్ చెల్లించాలని అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. 2015-16 సంవత్సరంలో 3 కోట్ల 30 లక్షల రూపాయలు చెల్లించామని, దానికి సంబంధించిన వివరాలు తెలియజేయకపోవడం విచారకరమన్నారు. నేడు ఆస్తులు అటాచ్‌మెంట్ చేస్తూ, నోటీసులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సత్యనారాయణ, రామ కృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి పవన్ జన్మదిన వేడుకలు

బొబ్బిలి: రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ వ్యవస్థాపకులు కొణిదెల పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వరకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. 29న స్థానిక కోరాడ వీధిలో క్లీన్ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, హాస్టల్ విద్యార్థులకు పెన్నులు, అట్టలు పంపిణీ, 30న సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ, హేండ్ ఇన్ హేండ్ నిర్వహిస్తారన్నారు.

వంశధార నదిలో శవమై..

భామిని: తాలాడ గ్రామానికి చెందిన వలరౌతు నిరంజీన్(52) శనివారం ఉదయం కోసలి గ్రామం వద్ద వంశధార నదిలో శవమై తేలాడు. పోలీసులు, స్థానికులు కథనం మేరకు నిరంజన్ గురువారం సాయంత్రం నది అవతల ఒడిశా కాశీనగర్ వెళ్లి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి వస్తున్నాడు. ఆ సమయంలో పడవ లేకపోవడంతో నది దాటుతున్న సమయంలో నదీ ప్రవాహానికి కొట్టుకుపోయారన్నారు. అయితే గురువారం రాత్రి వరకు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదన చెందగా శుక్రవారం నదీతీర ప్రాంతాలను యువత జల్లెడపట్టారు. అయినప్పటికీ ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం కోసలి సమీపంలో నదీ తీరాన శవమై తేలిన సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు లబోదిబోమన్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించారు. బత్తిలి ఎస్‌ఐ అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి కోసలి వద్ద పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరంజన్‌కు భార్య శారద, ముగ్గురు కుమార్తెలున్నారు. మృతితో తాలాడ గ్రామంలో విషాదం అలముకుంది.

చెరువులో పడి వ్యక్తి మృతి

బెలగాం: చెరవులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం పార్వతీపురం మండలం హెచ్ కారాడవలస గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం హెచ్ కారాడవలస గ్రామానికి చెందిన పాముల శివశేషు(27) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. దీనిపై పార్వతీపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సమాచారం.

వ్యక్తి అదృశ్యం

సంతకవిటి: మండలంలో పొనుగుటివలస గ్రామంలో సామంతుల దుర్గాప్రసాద్(30) కనిపించడం లేదని తల్లి సామంతుల భారతి సంతకవిటి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నెల 22వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన వ్యక్తి 23వ తేదీన తన స్నేహితులకు మేసేజ్ చేసి తల్లి, భార్య, పిల్లలను బాగా చూసుకోమని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సర్పంచ్‌పై దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

కొత్తవలస, ఆగస్టు 24: మండలంలోని చింతలపాలెం గ్రామ సర్పంచ్ మాకెన సీతారామపాత్రుడు(నవీన్)పై శుక్రవారం సాయంత్రం గ్రామసభలో జరిగిన దాడికి సంబంధించి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు కాయితపు భీష్మతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం చింతలపాలెంలో జరిగిన గ్రామసభ ముగిసిన తరువాత తనకు మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని మాజీ సర్పంచ్ కోరగా అందుకు సమస్యలు ఏమైనా ఉంటే లిఖిత పూర్వకంగా ఇవ్వాలని ఎమ్మెల్యే లలిత కుమారి సూచించారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ సీతారామపాత్రుడు సర్ది చెబుతుండగా ఒక్కసారిగా వైసీపీ నాయకులు దాడి చేయడంతో చేయివిరిగింది. ఇందుకు సంబంధించి సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీసర్పంచ్‌తో పాటు మరో ఇరువురిపైకేసు నమోదు చేశారు. ఈ ఘటన తరువాత గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని సీఐ తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. దాడి చేసిన వారికి నోటీసులు ఇచ్చి అరెస్టు చేస్తామని తెలిపారు.

నిందితుడు అరెస్టు


నిందితుడితో పోలీసులు

శృంగవరపుకోట: తప్పించుకు తిరుగుతున్న గంజాయి రవాణా నిందుతుడిని శృంగవరపుకోట పోలీ స్‌లు అరెస్టు చేశారు. సీఐ వి.ఎస్ మూర్తి అందించిన వివ రాలు ఇలా ఉన్నాయి. జి.మాడు గల మండలం కప్పల గ్రామానికి చెం దిన నాగుల నారాయణ అలియాస్ కిరణ్ గతంలో గంజాయి వ్యాపారం చేసేవాడు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లడ లాల్ జాట్ అనే వ్యక్తికి 140 కేజీల గంజాయిని అమ్మజూపాడు. ఈ కేసులో అప్పట్లో పోలీస్‌ల నుంచి తప్పించుకుని పారిపోయాడు. శనివారం ఉదయం 8గంటల సమయంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో తచ్చాడుతున్న ఇతన్ని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే


డిగ్రీ కళాశాలను సందర్శిస్తున్న అదితి

విజయనగరం రూరల్: విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సందర్శించి, అక్కడి విద్యా విధానం, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు డిగ్రీ కళాశాలలో ఉన్న పలు సమస్యలను ఆమెకు వివరించారు.

వెలుగు సీసీపై చర్యలు తీసుకోండి


వినతి పత్రం అందిస్తున్న వసి వీవోఏ త్రివేణి

శృంగవరపుకోట: తన దగ్గర ఉన్న రికార్డులను శృంగవరపుకోట వెలుగు సీసీ లాక్కొంటున్నారని, అయనపై చర్యలు తీసుకోవాలని వసి గ్రామానికి చెందిన వీవోఏ గుడిశ త్రివేణి శనివారం ఎంపీడీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. మూడు సంవత్సరాలుగా పని చేస్తున్న తనని తొలగించి, ఇటీవల కొత్తగా సంఘంలో చేరిన మహిళను నియమించారని, గ్రామంలో ఉన్న మహిళ సంఘ గ్రూపులన్నీ తననే వీవోఏగా ఉండాలని తీర్మాణించాయన్నారు. సంఘాలు వ్యతిరేకిస్తున్న మహిళను నియమించేందుకు వెలుగు అధికారులు రికార్డులను తనవద్ద నుంచి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు.

27న మండల సర్వసభ్య సమావేశం

రాజాం/రూరల్, ఆగస్టు 24: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన ఈనెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని అన్ని శాఖల అధికారులు పూర్తిసమాచారంతో హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్


కౌన్సిలింగ్ ఇస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ

బాడంగి, ఆగస్టు 24: స్థానిక పోలీసు స్టేషన్‌లో బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు శనివారం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లతో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో మార్పు కావాలని, ఎటువంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని అన్నారు. ముఖ్యంగా డ్రగ్స్‌తోపాటు గంజాయిని గ్రామాల్లో ప్రవేశించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఒడిషా నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసు సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం లక్ష్మీపురం పరిధిలో గల ఎరుకులపాకలు గ్రామంలో ఉన్న మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాన్ని పరిశీలించి సేఫ్టీ మెజర్మెంట్ ఉన్నాయా లేదా అనేది పరిశీలించారు. దానికి సంబంధించిన అనుమతులను, పాటించవలసిన నియమాలను కూడా నిర్వహణకు తెలియజేశారు. మందుగుండు సామగ్రి తయారు చేసేపుడు భద్రతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి



రోడ్డు భద్రతా నిబంధనలకు సంబంధించి పోస్టర్ విడుదల చేస్తున్న మజ్జి అప్పారావు

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 24: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. శనివారం నగరంలోని ఓ డిగ్రీ కళాశాలలో రోడ్డు సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు లైసెన్సు ఉంటేనే వాహనం నడపాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. సీనియర్ ఎంవీఐ రవిశంకర్ మాట్లాడుతూ, రవాణాశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తే, ప్రమాదాలకు దూరం కావచ్చునన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి, సమీపంలో ఉన్న ఆసుపత్రికి చేర్పించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్టయితే, ప్రభుత్వం రూ. 5 వేలు నగదు బహుమతి, ప్రాణాలు కాపాడిన వ్యక్తికి అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీబీఎల్ఎన్ రాజు, రోడ్డు సేఫ్టీ ప్రతినిధులు రాంబాబు, సైలాడ శ్రీహరిబాబు, తరుణావంకుశం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 14 పశువులు పట్టివేత

సీతంపేట: వ్యానులో అక్రమంగా తరలిస్తున్న 14 పశువులు పట్టుకుని, గోశాలకు తరలించామని సీతంపేట ఎస్ఐ జగదీష్‌నాయుడు శనివారం తెలిపారు. స్థానిక పీఎంఆర్‌సీ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో కొత్తూరు వైపు నుంచి పాలకొండ వైపు వస్తున్న వాహనాన్ని నిలుపుదల చేశామని చెప్పారు. వాహనంలో తనిఖీ చేపట్టగా 14 పశువులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. ఇరుకైన వాహనంలో ఇబ్బందికర రీతిలో తరలిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, పశువులను గోశాలకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

50 లీటర్ల సారా స్వాధీనం

మండలంలోని చిన్నబగ్గ గ్రామ సందర్శనకు వెళ్లిన సమయంలో ఒక వ్యక్తి సారాను తరలిస్తూ పోలీసులను చూసి పారిపోయాడని ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. అక్కడ విడిచిపెట్టిన 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. నిందితుడి ఆచూకీ కోసం వెతుకుతున్నామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొమరాడ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నీలకంఠం తెలిపారు. గత కొద్ది రోజులుగా నాగావళి, జంఝావతి నదుల నుంచి ఇసుకను అక్రమంగా కొంతమంది తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేసి, రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి పట్టివేత

పాచిపెంట: ఒడిశా నుంచి ఆంధ్రాకు గంజాయి దిగుమతి చేస్తుండగా శుక్రవారం రాత్రి రొడ్డవలస జంక్షన్‌లో పోలీసులు పట్టుకున్నారు. పది కేజీల 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన ప్రదీప్ కుమార్, శక్తి మురగన్, నెల్లూరు జిల్లాలకు చెందిన యర్లాంగిం సురేష్‌లను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు.

మద్యం స్వాధీనం

సీతానగరం (బలిజిపేట): సుభద్ర గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై ఓ మహిళ అక్రమంగా తరలిస్తున్న 50 మద్యం సీసాలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

● **మక్కువ:** స్థానిక ఆర్‌సీఎం వీధిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు లీటర్ల సారాను శనివారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. నిందితుడు దేవుపల్లి వినోద్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉలిపిరి హెచ్‌ఎంపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఈవో సుగుణకుమారి

కొమరాడ: మండలంలో ఉలిపిరి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గవర కృష్ణారావుపై అదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న మీసల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం డిప్యూటీ డీఈవో సుగుణకుమారి విచారణ నిర్వహించారు. తన పీఎఫ్ రుణం కోసం హెచ్‌ఎం రూ.70వేలు లంచంగా డిమాండ్ చేశారంటూ సుజాత ఫిర్యాదు చేశారు. అయితే ఆమె అసత్య ఆరోపణ చేస్తున్నారని సహచర ఉపాధ్యాయులతో పాటు హెచ్‌ఎం.. విచారణ బృందానికి తెలిపారు. ఆమె పెట్టుకున్న దరఖాస్తులు ఉన్నతాధికారులకు అందాయి. ఈ విచారణలో ఏఎంవో మోహన్‌రాయుడు, కొమరాడ ఎంఈవో నారాయణస్వామి, తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని డిప్యూటీ డీఈవో సుగుణకుమారి తెలిపారు.

అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

సాలూరు: మున్సిపల్ అధికారులు తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయానికి శనివారం వచ్చిన ఆమె కమిషనర్ కోసం ఆరా తీశారు. ఆమె పార్వతీపురం వెళ్లారని తెలియడంతో ఫోన్ చేశారు. మున్సిపాల్టీకి సంబంధించి ముఖ్యమైన పని ఉందని చెప్పినా పార్వతీపురం ఎలా వెళతారని ప్రశ్నించారు. కలెక్టర్ కార్యాలయానికి చాలా ముఖ్యమైన పనిమీద వెళ్లానని.. సాయంత్రం వచ్చి కలుస్తానని ఆమె బదులిచ్చారు. అనంతరం ఆర్ఐ శ్రీనివాసరావు కోసం ఆరా తీశారు. ఆయన కూడా కమిషనర్ వెంట వెళ్లానని చెప్పడంతో మున్సిపల్ మేనేజర్‌కు చెప్పి.. అనుమతి లేకుండా ఎలా వెళతారని ప్రశ్నించారు. 'ఆర్ఐగా మీరు సరిగా విధులు నిర్వహించడం లేదు. ఎప్పుడూ కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేద'ని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చాలా మంది అధికారుల తీరును కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ప్లానింగ్ అధికారి పద్మావతిని తన చాంబర్‌కు పిలిపించి.. మున్సిపాల్టీలో ప్లాన్లకు అనధికార వసూళ్లు జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. అనధికార వసూళ్లకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జూనియర్ అసిస్టెంట్ దేవీప్రసాద్‌ను పిలిపించి.. మద్యం తాగి ఎలా విధులకు హాజరవుతారని ప్రశ్నించారు. ప్లానింగ్ విభాగంలో ఉండవద్దని చెబుతున్నా అక్కడే ఎలా విధులు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఆయన సేవలు మున్సిపాలిటీకి అవసరం లేదని.. సరెండర్ చేయాలని అధికారులను ఆదేశించారు.


దోషులకు ఉరిశిక్ష విధించాలి



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ బాబిలత

రాయగడ: కోల్‌కతాలో మహిళా వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా రాయగడ అటానమస్ కళాశాల విద్యా ర్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. దోషులకు ఉరిశిక్ష విధించాలని కోరుతూ ప్లకార్డులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దేశంలో మహిళలు రోడ్డుపైకి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందని... దోషులకు కఠిన శిక్షలు లేని కారణంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత్ షారఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ యజమానుల నిరసన



కూనేరు వద్ద నిరసన తెలుపుతున్న కొండబాబు తదితరులు

రాయగడ: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు కూనేరు వద్ద రహదారులకు మరమ్మతులు చేయాలని కోరుతూ రాయగడ లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు అలియాస్ కొండబాబు, సీపీఎం నేత సాంబతో కలిసి శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూనేరు నుంచి పార్వతీపురం మార్గం పూర్తిగా శిథిలమై... రోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయని తెలిపారు.

ఒడిశా

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర వైద్యసేవల కోసం విశాఖకు రోగులను తీసుకెళ్లడం కష్టంగా ఉంటోందన్నారు. ఈ రోడ్లు పాడై మూడేళ్లు కావస్తున్నా మరమ్మతులకు నోచుకోలేదని, దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనాలు నడుపుతున్నారన్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కోరారు. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే సెప్టెంబరు 10న ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, బిహార్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు కీలక మార్గమైన కూనేరు వద్ద రహదారిని దిగ్బంధిస్తామని తెలిపారు.

చీరలే.. రక్షణ గోడలు!

● రేకుల షెడ్డులో పాఠాలు
● ఇదీ రాయిలంక ప్రాథమిక పాఠశాల దుస్థితి


రేకుల షెడ్డులో చీర తెరల చాటున నిర్వహిస్తున్న పాఠశాల

సీతంపేట: నాడు-నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం అనేక చోట్ల చిన్న చిన్న షెడ్లను కూడా మెరుగుపరచలేకపోయింది. దీంతో విద్యార్థులకు కష్టాల చదువులు తప్పడం లేదు. సీతంపేట మండల కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలోని మారుమూల ప్రాంతమైన రాయిలంకలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. వర్షం వస్తే విద్యార్థులు చదువుకోవడానికి వీలులేని పరిస్థితుల్లో దీనిని నిర్వహిస్తున్నారు. గ్రామస్థుల సహకారంతో తాత్కాలికంగా రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో వర్షపునీరు లోనికి రాకుండా చుట్టూ చీరలను రక్షణ గోడలా చేశారు. కనీసం ఉపాధ్యాయులు ఉండడానికి వీలులేని పరిస్థితి ఉంది. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 25 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మూడో విడత నాడు-నేడు పథకం కింద ప్రతిపాదనలు పెట్టినప్పటికీ నిధులు మంజూరు కాలేదని స్థానికులు తెలిపారు. పాఠశాల విషయాన్ని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని గ్రామస్థుడు నాజీర్ తెలిపారు. తమ గ్రామానికి రహదారి ఉన్నా... పూర్తిగా రాళ్లు తేలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి ఆనందరావు వద్ద ప్రస్తావించగా... నాడు-నేడు పథకం కింద పాఠశాల భవన నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

అర్హులందరికీ జాబ్‌కార్డులు అందించాలి

● ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

పాలకొండ: అర్హులైన వారందరికీ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు అందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మాళి భాను ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లుగా నూతన జాబ్‌కార్డులు జారీ చేయకపోవడంతో అర్హులు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని తంపటాపల్లి సర్పంచ్ జాడ శ్రీధర్, తుమరాడ ఉప సర్పంచ్ పొట్నూరు శోభారాణి సభ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అంగన్‌వాడీలకు నూతన భవనాల నిర్మాణానికి, మరమ్మతులకు చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానన్నారు. తోటపల్లి కాలువల ద్వారా శివారు ప్రాంతాలకు నీరందడం లేదని తంపటాపల్లి ఉప సర్పంచ్ జాడ శ్రీధర్, లుంబూరు మాజీ సర్పంచ్ రౌతు సోంబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై జేఈ శంకరరావు స్పందిస్తూ లస్కర్లు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇబ్బందులు లేకుండా శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ అంశాలపై ప్రస్తావించే సమయంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్య ప్రకాష్ సమాధానం చెప్పడంపై ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీపీ సారథ్యంలో మండల సర్వసభ్య సమావేశం జరగాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీడీఓ ఉమామహేశ్వరి, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

వీరఘట్టం: అధికారులు ప్రజా సమస్యలపై స్పందించి, వెంటనే పరిష్కరించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందడం లేదని పలువురు ఏవో సౌజన్యను నిలదీశారు. ఎరువుల సరఫరాదారులకు ఇండెంట్ పెట్టామని, వచ్చిన వెంటనే రైతులకు అందిస్తామని ఆమె తెలిపారు. మండలంలో పంట కాలువలు గట్లు పలుచోట్ల గండ్లు పడడం వల్ల నీరు వృథాగా పోతుందని, దీంతో శివారు భూములకు నీరు అందక నాట్లు వేయడం ఆలస్యం అవుతుందని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఏపీవో జి.సత్యంనాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కాలువలకు పూడికలు తీస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి


డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసు కోవాలని సీఐటీయూ నాయకులు జి.వెంకట రమణ, బీవీ విరమణ కోరారు. ఈ మేరకు శనివారం డీఆర్వో కేశవ నాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

సీతంపేట రూరల్: బుడగరాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను డిప్యూటీ డీఈవో పి.నారాయుడు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వంటశాల, మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం నారాయణగూడ జీపీఎస్ పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట సీఎంవో చిరంజీవి ఉన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఈనెల 26న రద్దు చేయనున్నారు. కృష్ణాష్టమి సెలవు దినం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కలెక్టర్ శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దీనిని గమనించాలని కోరారు.

కేదారిపురంలో ప్రజాదర్బార్


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: కేదారిపురం గ్రామంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. కేదారిపురం, వంగర గ్రామాల ప్రజలు సమస్యలపై వినతిపత్రాలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గిరిజన గ్రామాలకు రహదారులు మంజూరు చేయిస్తానని చెప్పారు. నిరుపేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వీటితో పాటు ఇంటింటి కొళాయిలు వేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, జనసేన ఇన్‌చార్జి మల్లేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూషణరావు, ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, కత్రిక వెంకటరావు, బుజ్జేశ్వరరావు, అడ్డాకుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా నాగావళి

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు 3 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం నదిలోకి చేరింది. శనివారం నాటికి కొంతమేర తగ్గు ముఖం పట్టింది. ఎగువ నుంచి నదిలోకి 2 వేల క్యూసెక్కులు చేరుతోంది. సాగునీటి అవసరాలకు ప్రధాన కాలువల నుంచి 1,220 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నారు. స్పిల్‌వే గేట్లు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో 105 మీటర్లకు గాను 104.40 మీటర్ల మేరకు నిల్వలు ఉన్నాయని డీఈ టి.రఘునాథ నాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్ కుమార్‌లు తెలిపారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న జేసీ


జేసీకి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందిస్తున్న అర్చకులు

పాలకొండ: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన కోటదుర్గమ్మ అమ్మవారిని జేసీ శోభిక శనివారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం ఆమెకు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

చదువుకున్న కళాశాలలోనే అధ్యాపకురాలిగా..

● ఆదర్శం.. శ్రీవాణి పయనం



గుమ్మలక్ష్మీపురం/ కురుపాం రూరల్: కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం ఎంత సులువో ఆ అధ్యాపకురాలు గిరిజన విద్యార్థులకు ఉద్బోధిస్తున్నారు. తన ప్రయాణమే దీనికి ఉదాహరణగా చూపిస్తున్నారు. ఆమె పేరు ఆలుగు శ్రీవాణి. వివరాలలోకి వెళితే... గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం హిస్టరీ లెక్చరర్‌గా పని చేస్తున్న శ్రీవాణి.. ఆదే కళాశాలలో 2009-2012లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2013-2015లో ఆంధ్రా యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. అనంతరం 2015లో గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా చేరారు. విద్యార్థులకు పాఠాలు చెబుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈలోగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ వారు డిగ్రీ కళాశాల లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా... 2021లో మొదటి ప్రయత్నంలోనే సఫలీకృతమయ్యారు. తాను గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న కళాశాలలోనే పూర్తి స్థాయి అధ్యాపకురాలిగా బాధ్యతలు చేపట్టారు. తనలా ఓ లక్ష్యాన్ని నిర్ణయించుకొని.. నిరంతరం ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చని చాటి చెబుతున్నారు. ఈ విషయమై శ్రీవాణి మాట్లాడుతూ తాను చదువుకున్న చోటనే అధ్యాపకురాలిగా బోధించే అవకాశం రావడం జీవితంలో మరపురాని అనుభూతి అని అన్నారు. పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందడం ప్రస్తుతం తన లక్ష్యమని శ్రీవాణి చెప్పారు.


కళాశాలలో బోధిస్తున్న శ్రీవాణి

ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

పాలకొండ: పాలకొండ ఎస్ఐగా ప్రయాగమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం స్పెషల్ బ్రాంచిలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై పాలకొండ వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలపై దృష్టి పెడతామని చెప్పారు. ఇంతకుముందు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ఎన్.ప్రశాంత్ కుమార్‌ను వీఆర్‌లో ఉంచారు. ● **వీరఘట్టం:** వీరఘట్టం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా కె.కళాధర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన ఎస్ఐ ష క్రుద్దీన్ వీఆర్‌పై వెళ్లడంతో పార్వతీపురం సీసీఎస్ ఎస్ఐగా ఉన్న కళాధర్ వీరఘట్టం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ● **గరుగుబిల్లి:** స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐగా పి.రమేష్‌నాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన వై.అమ్మన్నరావుకు వీఆర్‌లో ఉంచారు. మద్యం, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటానని ఎస్ఐ రమేష్‌నాయుడు తెలిపారు.

మెరుగైన విద్య అందించాలి

పార్వతీపురం రూరల్: విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్య సదుపాయాలు అందించాలని అడిషినల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్యజాస్మిన్ తెలిపారు. కవిటిభద్ర కేజీబీవీ బాలికల పాఠశాలను ఆమె శనివారం తనిఖీ చేశారు. వసతి గృహంలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

ఏ సమస్య ఉన్నా నేరుగా చెప్పవచ్చు

● మంత్రి సంధ్యారాణి


ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి

సాలూరు: నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్య ఉన్నా నేరుగా తనకు వచ్చి చెప్పవచ్చునని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరులోని తన నివాసంలో శనివారం ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి ప్రజలు నేరుగా ఆమెను కలిసి, తమ సమస్యలను విన్నవించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తమ గ్రామాలకు తాగునీరు, రోడ్లు వేయాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. మారయ్యపాడు గ్రామానికి తాగునీరు సౌకర్యానికి నిధులు మంజూరు చేసినందుకు ఆ గ్రామస్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు పనిఒత్తిడి తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్లు, తమకు జీతాలు పెంచాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు కోరారు. నియోజకవర్గంలో ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తనను నేరుగా కలిసి చెప్పవచ్చునని, రాష్ట్రానికి మంత్రిని అయినప్పటికీ ఈ నియోజకవర్గానికి మాత్రం ఎప్పటికీ ఆడపడుచునేనని ఆమె తెలిపారు.

క్లుప్తంగా..

నీట్ పీజీలో మెరిసిన లిఖిత



పాలకొండ: పట్టణానికి చెందిన బంకురు లిఖిత నీట్ పీజీ-2024లో ప్రతిభ చూపింది. శనివారం విడుదలైన నీట్ పీజీ ఫలితాల్లో ఆల్ ఇండియా 1034 ర్యాంకు సాధించింది. లిఖిత తండ్రి బంకురు శ్రీనివాసరావు వ్యాపారవేత్త కాగా, తల్లి పద్మావతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. లిఖిత ఆల్ ఇండియా రాంకులో 99.53 శాతం సాధించింది.

ఈ-పంట నమోదు వేగవంతం చేయాలి

సీతంపేట: మండలంలో ఈ-పంట నమోదు వేగవంతం చేయాలని తహసీల్దార్ అప్పలరాజు సూచించారు. శనివారం స్థానిక వైటీసీ సమావేశ మందిరంలో వ్యవసాయ సహాయకులు, వీఆర్‌వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రియా శ్రీదేవి, ఉద్యానవన అధికారి వెంకట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గరుగుబిల్లి: మనోబంధు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ డాక్టర్ డొల్లు పారినాయుడు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తామని తెలిపారు.

గ్రామసభలు విజయవంతం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలు విజయవంతమయ్యాయని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం తెలిపారు. మొత్తం 451 గ్రామ పంచాయతీల్లో దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. అన్ని పంచాయతీల్లో సుమారు 50 నుంచి 150 వరకు పనులకు ప్రతిపాదనలు తయారు చేసినట్టు తెలిపారు.

పోలమాంబకు వెండి హారం

మక్కువ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శంబర పోలమాంబ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన అల్లు జగన్, వెంకటలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు ఒక కిలో 150 గ్రాముల వెండి హారాన్ని శనివారం బహూకరించారు. ఈ హారానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


వెండి హారంతో పోలమాంబ